18.6.2000

# కన్యాశుల్కం - నూరేళ్ల సమాలోచనం

– (సంపా.)ఆచార్య మొదలి నాగభూషణ శర్మ, డా. ఏటుకూరి ప్రసాద్

ఇదొక అసాధారణ గ్రంథం. 1897లో తొలిప్రచురణ వెలుగు చూసిన 'కన్యాశుల్కం' అంతకు అయిదేళ్ళు ముందుగానే ప్రదర్శితమయింది. రెండో కూర్పు 1909లో వచ్చి సాహితీ ప్రపంచాన్ని మంత్రముగ్ధం చేసింది; గురజాడ వేంకట అప్పారావు గారికి యుగకర్తృత్వం, నవయుగ వైతాళికత్వం సాధించింది. ప్రదర్శనకు 1982లో, ప్రచురణకు 1997లో శతజయంతి మహోత్సవాలు జరిగాయి. గురజాడ జీవితకాలంలోనే కన్యాశుల్కనాటకం మీద విమర్శలూ ప్రతివిమర్శలూ వచ్చాయి. ఆయన మరణానంతరం (1915 తరవాత) రచనను విశ్లేషించి వివేచించటం, గుణదోషాలు చర్చించటం పెద్దయెత్తున జరిగి శతయంతినాటికి అదో మహత్తర రచన అనే నిర్ధారణకు వచ్చింది సాహితీ ప్రపంచం.

గురజాడ అకవి, కుకవి అనే వాదనలే గాక అసలాయనకు తెలుగే రాదని, కన్యాశుల్కం

రచయిత కాదని, కాకపోతే ఇంగ్లీషులో రాస్తే ఎవరో తెలుగు చేశారనే దాకా ఒకమార్గం కృషిచేసింది. అందులో వావిళ్ల వేంకటేశ్వరశాస్త్రిగారి పరోక్ష శ్రమకు పోషితకవిపండితుల శాబ్దికఘోష సాయపడింది. మొదట అలా దుర్వాదాలు చేసినవారే గురజాడ కన్యాశుల్కం పరమాద్భుతమని దరిమిలా కీర్తించి రాశారు! తొలి చర్చ నుంచి 1999 చివరి దాకా వచ్చిన 'సీరియస్ రచనల గురించి' దాదాపు 180 వ్యాసాలను ఎంపికచేసి ఈ బృహత్సంపుటిలో గుదిగుచ్చి ప్రచురించిన సంపాదకద్వయాన్నీ, కేవలం ప్రచురణ వ్యయానికే సాహితీ లోకానికి అందించిన విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ వారినీ ప్రశంసించక తప్పదు.

ఈగ్రంథాన్ని విషయానుగుణంగా పదమూడు పరిచ్ఛేదాలుగా విభజించి, వాటిలో సాధ్యమయినంతవరకూ కాలక్రమానుసారంగా ఆయా వ్యాసాలను ప్రచురించారు. కన్యాశుల్కం గురజాడ రచనేనా అనే ప్రశ్నతో మొదటి పరిచ్ఛేదం మొదలవుతుంది. కన్యాశుల్కం ప్రదర్శనల సమస్యలను గురించి చివరి పరిచ్ఛేదం వివరిస్తుంది. పూర్వోత్తర ప్రతుల తులనాత్మక పరిశీలన, ఇతివృత్తం, పాత్రచిత్రణ, భాష, రస చర్చ, సమకాలీన సమాజ ప్రభావం మొదలైనవి విపులంగా ఉన్నాయి. కన్యాశుల్కాన్ని పునర్మూల్యాంకనం చేశారు. సంపాదకు లిద్దరూ విడివిడిగా రాసిన పరిచయాలు ప్రశంసనీయాలు. వీలువెంట గురజాడ సాహిత్యం గురించి ఇంగ్లీషులో వచ్చిన వ్యాసాలను కూడా సేకరించి ప్రచురించాలనే సంపాదకుల సంకల్పం నెరవేరాలని ఆశిద్దాం. గ్రంథాంతంలో గురజాడ జీవితరేఖాచిత్రంతోబాటు ఆధారగ్రంథాలను కూడా పరిచయం చేశారు. గురజాడ సాహిత్యాన్ని అనేక విధాల పరిశ్రమించి వెలికితెచ్చిన సెట్టి ఈశ్వరరావు, అవసరాల సూర్యారావు, కె.వి. రమణారెడ్డి, బంగోరేల స్మృతి కీగ్రంథాన్ని అంకితం చేయటం సముచితం.

తెలుగు విమర్శ ఎన్ని రకాలుగా ఎన్ని ధోరణుల్లో ఎలా సాగిందో గమనించటానికూ్కడా ఈగ్రంథ ముపయోగపడుతుంది. వ్యాసాల ప్రమాణం గొప్పది. భాషాభిమానులూ సాహితీపరులూ తప్పక కొని చదివి దాచుకోవలసిన మహాగ్రంథమిది.

27.8.2000